మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

ఎమ్మెల్సీ కవిత

సభలో మాట్లాడుతున్న కేసీఆర్

సభలో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, తలసాని సాయికిరణ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

స్వామి గౌడ్

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

పొన్నాల లక్ష్మయ్య

బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రతినిధుల సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఇతర రాష్ట్ర స్థాయి ప్రతినిధులకు పార్టీ సంస్థాగత నిర్మాణం పై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రజల తరపున పోరాటం చేసేందుకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రతినిధుల రాకతో తెలంగాణ భవన్ సందడి గా మారింది.

తెలంగాణ ఉద్యమకారులకు..

250 గజాల స్థలమివ్వాలి

ఉద్యమకారుల జేఏసీ డిమాండ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19– తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారందరికీ 250 గజాల స్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రపుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, జేఏసీ గౌరవ అధ్యక్షుడు రంగారెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల కు 250 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఉద్యమంలో పని చేసి లబ్ధి పొందని కళాకారులను సాంస్కృతి సారథిలోని వివిధ పోస్టులలో అవకాశం ఇవ్వాలని, ఉచిత బస్సు పాసులు 250 గజాలు ఇంటి స్థలంలో పాటు 4 గదుల ఇల్లు నిర్మించి అందజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు ఆర్థిక సహకారాలు అందిస్తున్నట్లుగా తెలంగాణ ఉద్యమకారులకు నెలకు 30000 గౌరవ వేతనాన్ని ప్రతినెలా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు సోమన్న, యాదగిరి ,చంద్రన్న ప్రసాద్, మాధవి ,యాదగిరి ,ఏ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడేందుకే కేంద్ర బడ్జెట్

సామాన్య ప్రజలు అంటే కేంద్ర ప్రభుత్వానికి లెక్కలేదు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు ఉపయోగ పడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. బుధవారం ఆర్టీసీ ఎక్స్ రోడ్ వద్ద జరిగిన వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలొ అయన పాల్గొని మాట్లాడుతూ బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడే విధంగా ఈ బడ్జెట్ ఉందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేక పోయారని తెలిపారు. సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వేంకటేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్థికవేత్త పికెట్టీ సూచించిన విధంగా రూ.10కోట్లు అంతకుమించిన ఆదాయం ఉన్న ధనికుల మీద సంపద పన్ను పునరుద్ధరించి కనీసం 33శాతం వారసత్వపు పన్ను విధిస్తే కేంద్ర ప్రభుత్వానికి కావలసినంత ఆదాయం పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శివర్గ సభ్యులు బండారి రవికుమార్ గారు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హన్మేశ్, ఎంసీపీఐ యు రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, ఎస్ యుసిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తేజ లు నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం. శ్రీనివాసరావు, ఎం.దశరథ్ తదితరులు పాల్గొన్నారు

సింగరేణి భవన్ ముందు కార్మికుల ఆందోళన

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 19. సింగరేణి మారుపేర్లు విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యపై పరిష్కరించాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాకరు. సైఫాబాద్‌లో గల సింగరేణి భవన్ ప్రధాన కార్యాలయం ముందు బాధిత కుటుంబ సభ్యులు తిరులమ శ్రీనివాస్, రామిండ్ల సందీప్, లక్క శ్రావణ్, ఇ. ఓం ప్రకాష్, డి. రాజు, జి శ్రవణ్, ఈ సతీష్, ఎం. నవీన్‌కుమార్ తదితరులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతమైన పద్ధతిలో గోటేలి కొండనుండి కొత్తగూడెం ప్రధాన కార్యాలయం వరకు సుమారు 350కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకపోవడం శోచనీయమని అన్నారు. సింగరేణి మారుపేర్ల సమస్య పరిష్కారం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధులను, కార్మిక సంఘాలను తమ సమస్యను విన్నవించుకున్నామని వారు వాపోయారు.

21 ఏండ్లుగా ఊపిరితిత్తుల్లోనే పెన్‌క్యాప్

తొలగించి ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు

మాదాపూర్, ఫిబ్రవరి 19: 21 ఏళ్లుగా ఊపిరితిత్తుల్లోనే ఇరుక్కుపోయిన పెన్ క్యాప్‌ను కిమ్స్ వైద్యులు తొలగించి యువకుడిని కాపాడారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల యువకుడు తనకు 5 ఏండ్ల వయసు ఉన్నప్పుడు ఆడుకుంటూ పెన్ క్యాప్ మింగేశాడు. ఆ సమయంలో సమీపంలోని డాక్టర్ వద్దకు వెళ్లగా ఆయనకు ఊపిరితిత్తుల్లో ఎలాంటి పెన్‌క్యాప్ కనిపించలేదు. బహుశా మలద్వారం గుండా బయటికి వెళ్లి ఉండొచ్చని సదరు వైద్యుడు కుటుంబ సభ్యులకు వివరించాడు. అయితే ఇన్నాళ్ల వరకు ఆరోగ్య పరంగా ఆ యువకుడికి ఏ సమస్యా రాలేదు. అయితే ఇటీవలి కాలంలో నెల రోజుల నుంచి ఆ యువకుడికి విపరీతమైన దగ్గు వస్తున్నది. దాంతో పాటు బరువు తగ్గిపోవడం, నిద్రలేమి వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. కాగా, కుటుంబ సభ్యులు స్వగ్రామంలో ని ఓ ప్రైవేట్ దవఖానాలో చూపించగా సీటీ స్కాన్ చేశారు. వైద్యులు ఎడమవైపు కిందిభాగంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించి హైదరాబాద్‌కు వెళ్ళమని సూచించారు. అనంతరం కొండాపూర్ కిమ్స్ దవఖానాలోని కన్సల్టెంట్ క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శుభకర్ నాడెళ్ల ను సంప్రదించగా ఆ యువకుడికి సీటీ స్కాన్ చేసి చికిత్స అందించారు. మొదట ఆ యువకుడికి సీటీ స్కాన్ చేస్తే వైద్యులకు లోపల ఏదో గడ్డలా కనిపించింది. ఆ గడ్డ వల్లే ఊపిరితిత్తుల వద్ద ఆటంకం ఏర్పడి... దగ్గు వస్తోందని అనుకున్నట్లు వైద్యులు తెలిపారు. అయితే గడ్డను తొలగించే ప్రక్రియలో భాగంగా ఊపిరితిత్తులను పరిశీలిస్తే లోపల 21 ఏండ్ల నాడు ఇరుక్కుపోయిన పెన్‌క్యాప్ కనబడింది. దీంతో వైద్యులు అవాక్కయ్యారు. కుటుంబ సభ్యల ద్వారా వివరాలు సేకరించారు. దాదాపు మూడు గంటల పాటు కష్టపడి, ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపీ సాయంతో ముందుగా దాని చుట్టూ పేరుకుపోయిన కణజాలాలు, లింఫ్‌నోడ్, కండలను కొద్దికొద్దిగా తొలగించి ఆ పెన్ క్యాప్‌ను కూడా బయటకు తీశారు. కాగా ఇన్ని సంవత్సరాల పాటు శరీరం లోపల పెన్ క్యాప్ ఇరుక్కుపోవడం తో ఊపిరితిత్తులు కూడా కొంత దెబ్బతిన్నాయని కిమ్స్ వైద్యులు చెప్పారు. మరింత ఆలస్యం చేసి ఉంటే చుట్టూ కణజాలం పేరుకుపోయి ఊపిరితిత్తులు పూర్తిగా పాడైపోయే ప్రమాదం ఉండేదని అప్పుడు దాన్ని శస్త్రచికిత్సతో పాడైన భాగాన్ని కోసేయాల్సి ఉండేదని అదృష్టవశాత్తు ముందే గుర్తించడంతో మందులతోనే దాన్ని సరిచేయగలిగామని డాక్టర్ శుభకర్ వివరించారు.

మా సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్‌కు టీఎన్జీఓల విజ్ఞప్తి

సుల్తాన్ బజార్ ఫిబ్రవరి 19. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారు సంఘం నాయకులతో కలిసి ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల పీఆర్సీ,పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, కొత్త జిల్లాల లో అదనపు క్యాడర్స్, ఉద్యోగుల హెల్త్ కార్డ్స్ తదితర అంశాల పట్ల ప్రభుత్వం వెంటనే ఆలోచించి పరిష్కరించాలని వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చ జరిపామని తెలిపారు. ఈ విషయమై స్పందించిన ముఖ్యమంత్రి సానుకూలంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా ఉద్యోగుల అన్ని సమస్యలను పరిష్కరిస్తుందని ఎవరు ఆందోళనకు గురి కావొద్దని చెప్పినట్టు వెల్లడించారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ తో పాటు ఇతర సంఘ నాయకులుపాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సమస్యలను విన్నవించిన టీఎన్జీవో నేతలు

స్వచ్ఛ ఆటో కార్మికులను ఇబ్బందులు పెడితే ఊరుకోం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) ః జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి సర్కిల్ తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మిక యూనియన్ సభ్యుల సమావేశం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్ అధ్యక్షతన లిబర్టీ యూనియన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికులకు సంబంధించిన ఆటో టిప్పర్లను ఆర్టీఏ అధికారులు ఎప్పటి నుంచో జీహెచ్ఎంసీ చెల్లించాల్సిన రోడ్ టాక్స్ పెండింగ్ ఛలాన్‌లను కార్మికులపై రుద్దుతూ ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. త్వరలో మేయర్ విజయలక్ష్మీ, కమిషనర్ ఇలంబర్తిని కలిసి సమస్యలపై వినతిపత్రం ఇవ్వాలని సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు గోపాల్ నాయక్, హంస రాజు, శేఖర్ పాల్గొన్నారు.

సీపీఆర్ అత్యవసరం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : హైకోర్టులో వాదనలు కొనసాగిస్తూ కుప్పకూలి సీనియర్ న్యాయవాది వేణుగోపాల్ మృతి చెందిన కొద్ది గంటలకే సికింద్రాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది బి.వేంకటేశ్వర్లు గురువారం గుండెపోటుకు గురై మరణించిన వార్త న్యాయవాదులందరినీ కలచివేసింది. వరుస సంఘటనల నేపథ్యంలో నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుండెపోటుకు గురైన వారికి అత్యవసర చర్యల్లో భాగంగా సీపీఆర్ ఉపయుక్తంగా ఉంటుందని యశోద ఆసుపత్రి డిప్యూటీ మేనేజర్ కె.రమేష్, డా.మహేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజ్యవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు బి.కొండారెడ్డి, సభ్యులు ఈశ్వర్ పాల్గొన్నారు.

అక్రమ ఔషధ గోదాంపై డీసీఏ దాడులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): అనుమతి లేకుండా అక్రమంగా ఔషధాలను నిలువ ఉంచిన గోదాంపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు జరిపారు.ఈ దాడుల్లో రూ.6.70లక్షల విలువ చేసే ఔషదాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాటిల్లో 6రకాల గడువు తీరిన ఔషధాలు, అబార్షన్ కిట్స్ తదితర ఔషధాలు ఉన్నట్లు డీసీఏ అధికారులు తెలిపారు. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...ఉప్పల్‌లోని ఖల్సా గ్రామం, లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన అడ్డంకి వెంకటసురేష్ బాబు తన నివాసంలో ఎలాంటి అనుమతి లేకుండా పెద్ద ఎత్తున ఔషధాలను నిలువ ఉంచాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు అక్రమ ఔషధ గోదాంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.6.70లక్షల విలువ చేసే ఔషదాలు సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడికి నోటీసులు పంపారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్ అబిదా, డ్రగ్ ఇన్స్పెక్టర్లు డా.బి.లక్ష్మీనారాయణ, బి.ప్రవీణ్, పి.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ గోదాంలో స్వాధీనం చేసుకున్న మందులతో డీసీఏ అధికారులు

ఉరితాళ్లవుతున్న బెట్టింగ్‌లు

2017లోనే నిషేధించిన కేసీఆర్ సర్కారు

మళ్లీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు

బెట్టింగ్‌లను అరికట్టడంలో విఫలమవుతున్న పోలీసులు

మాదాపూర్ ఘటనతో ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కొందరు యువత పాలిట ఉరితాడుగా మారుతున్నాయి. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో చాలా మంది ఈ జూదం ఉచ్చులో కూరుకుపోయి, చివరకు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటలను నిషేధిస్తూ 2017లోనే చట్టం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ చట్టం ప్రకారం ఆన్‌లైన్లో జూదం నిర్వహించడం, ఆడటం కూడా నేరమే. అయినప్పటికీ నిషా వైఫల్యమో లేకా కొందరి ప్రత్యేక ఒప్పందాలో తెలియదు కాని రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు పుట్టగొడుగుల్లానే పుట్టుకొస్తున్నాయి. జోరుగానే జూదం కీడ్రలు సాగుతున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డ చాలమంది యువత తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల ఖాతాలకు పంపిస్తున్నారు. అక్రమ పద్ధతిలో నడుస్తున్న ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లలో నిర్వాహకులు ఏఐ సహకారాన్ని తీసుకుంటూ కోట్ల రూపాయల వ్యాపారాన్ని చేస్తున్నట్లు సమాచారం. అమాయకులకు వల వేసి భారీగా సంపాదిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్లు ఈ గేమ్స్‌ను ప్రమోట్ చేయడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను వాడుకుంటున్నారు. అందుకోసం భారీగానే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. రమ్మీ లాంటి ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారు ఆ షాక్ నుంచి కోలుకోక, బయట మొఖం చూపించలేక బలవన్మరణాలకు పాల్పడ్డ ఘటనలు రాష్ట్రం వ్యాప్తంగా తరుచు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మోహన్ అరవింద్ కుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.2లక్షలు పోగొట్టుకుని మాదాపూర్‌లోని ఖానామెట్‌లో ఈనెల 17న ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే.

జిమ్మిక్కులు చేస్తూ...!

ఆన్‌లైన్ రమ్మీ, ఇతర గ్యాంబ్లింగ్ ఆటలోకి కస్టమర్లను ఆకర్షించేందుకు వివిధ వెబ్‌సైట్లు ఇంటర్‌నెట్‌లో భారీ ప్రకటనలిస్తుంటాయి. దానికి తోడు తమ వెబ్‌సైట్లో సభ్యత్వం తీసుకుంటే బంపర్ ఆఫరిస్తామంటూ బుట్టలో పడేస్తున్నారు. ఆట ప్రారంభంలో డబ్బులు ఇచ్చినట్లే చేసి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటపై వినియోగదారులకు మోజు పెంచుతున్నారు. ఇది వ్యసనంగా మారడంతో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటల నుంచి బయటకు రాని పరిస్థితిలో చాలమంది ఉంటున్నారు. ఏ సభ్యుడు రోజు ఎంత సేపు ఆడుతున్నాడనే విషయాన్ని గుర్తిస్తూ, ఆన్‌లైన్ సైట్ నిర్వాహకులు వారి దృష్టంతా ఆటపై ఉండేందుకు జిమ్మిక్కులు చేస్తుంటారు. మొదట రమ్మీ, ఇతర బెట్టింగ్ ఆటలు ఆడిన వారికి గెలిచేందుకు కొంత అవకాశమిస్తారు, ఆ తరువాత వారికి ఆటను ఆలవాటు చేసి ఇక ఆశలో వారిని ముంచేస్తుంటారు. పది సార్లు పెట్టుబడి బడితే అందులో 8 సార్లు నష్టపోవడం, రెండు సార్లు లాభం వచ్చినట్లు చూపించే లాజిక్స్‌ను బ్యాకెండ్ నుంచి గ్యాంబ్లింగ్ ఆట నిర్వాహకులు చేస్తుంటారు. ఇలాంటి గ్యాంబ్లింగ్ ఆటపై గతంలో హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. కలర్ ప్రిడిక్షన్ గేమ్‌ను గతంలో ఉక్కుపాదంతో అణిచివేశారు. ఈ గేమ్‌లో నష్టపోయిన వారు ఆత్మహత్యలు చేసుకుంటుండడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వేగంగా పోలీసులు స్పందించి మూలాల వరకు వెళ్లి ఆన్‌లైన్‌లో జరిగిన స్కామ్‌ను వెలుగులోకి తెచ్చి దేశ వ్యాప్తంగా నిర్వాహకులను పట్టుకున్నారు.

మార్కెటింగ్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లు..!

సోషల్‌మీడియాలో ఇన్‌ఫ్లూయెన్సర్స్ ప్రభావం నేడు సామాన్య ప్రజలపై చాల ఉంటుంది. ఈ నేపథ్యంలో పలు వ్యాపార సంస్థలు తమ వ్యాపారాభివృద్ధికి ఇన్‌ఫ్లూయెన్సర్‌తో ప్రకటనలు ఇప్పిస్తున్నారు. సాధారణంగా వ్యాపార ప్రకటనలు ఇస్తే తక్కువ మొత్తంలోనే ఆదాయం ఉంటుంది. అదే నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను మార్కెటింగ్ చేస్తే భారీగా ఆదాయం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన లింక్‌లు తమ సోషల్‌మీడియా ఖాతా ద్వారా తమ ఫాలోవర్స్‌కు చేరే విధంగా మార్కెటింగ్ చేస్తున్నారు. కొందరికి లక్షల్లో వ్యూవర్స్ ఉంటున్నారు. అందులో కనీసం 10 శాతం మంది అయినా ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో బెట్టింగ్ యాప్‌లకు భారీగానే ఆదాయం వస్తుంది, అందులో కొందరు కమిషన్లు తీసుకుంటూ మరింతగా ప్రమోట్ చేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్ ఇతర రాష్ట్రాలు, దేశాల వేదికగానే కొనసాగుతున్నాయి. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్స్ ఇస్తూ కొంత మంది సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇలా సంపాదించిన మనీని విచ్చలవిడిగా కష్టపెడుతూ తాము స్వచ్ఛంగా సంపాదించామనే బిల్డప్ ఇస్తుంటారు. అయితే పోలీసులు ఈ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు, ఇన్‌ఫ్లూయెన్సర్స్‌పై లోతైనా దర్యాప్తు జరిపితే ఎన్నో కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్ కూల్చివేత

సరూర్‌నగర్‌లోని ఉన్న వాణిజ్య సముదాయాన్ని షాపులు ఖాళీ చేయించి బుధవారం నుంచి హెచ్ఎండీపీ అధికారులు కూల్చివేస్తున్నారు. కూల్చివేతల కోసం రెండు భారీ హిటాచీ వాహనాలను వాడుతున్నారు. భవనం ముందు భాగంలోని నిర్మాణాలను ముందుగా కూల్చివేశారు. కాగా ఆ స్థలంలో ప్రజా ఉపయోగ భవనం నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. – ఎల్బీనగర్

మురుగునీటి పర్యవేక్షణలో ఓయూ పరిశోధన పత్రం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 19– ప్రస్తుత రోజుల్లో సంక్లిష్టంగా మారిన మురుగునీటి సరఫరా అవరోధాలను అధిగమించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం బృందం ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేసింది. ప్రొఫెసర్ కే శశికాంత్ నేతృత్వంలో అధ్యాపకులు, విద్యార్థులు ఐఓటీ ఆధారిత మురుగునీటి పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించింది. దీని ఆధారంగా మురుగునీరు పొంగిపొర్లడంతో పాటు హానికర వాయువుల విడుదలను గుర్తించవచ్చు. పారిశుద్ధ్య కార్మికుల భద్రతతో పాటు సమర్థవంతమైన పట్టణ వ్యర్థాల నిర్వహణ కూడా సాధ్యమవుతుంది. దీనికి సంబంధించిన పరిశోధన పత్రాన్ని అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (ఎ.ఎస్.సి.ఇ.) ఆధ్వర్యంలో చండీగఢ్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టైనబుల్ స్మార్ట్ సిటీస్‌లో సమర్పించారు. ఈ వ్యవస్థలో అధునాతన వాయు, జల సెన్సార్ల ద్వారా పొంగిపొర్లడం, విషవాయువులు తదితర సమయాల్లో అధికారులను అప్రమత్తం చేస్తుంది. ఇటీవల కాలంలో డ్రైనేజీలో వెలువడుతున్న విషవాయువుల కారణంగా పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందడం, అనారోగ్యాల బారిన పడటం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం బృందం చేపట్టిన ఈ పరిశోధన కీలకంగా మారనుంది. ఈ సందర్భంగా ఈ బృందాన్ని ఓయూ అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

సదస్సుకు హాజరైన అధ్యాపకులు, విద్యార్థుల బృందం

పాతనగరం లో పర్యటించిన బీసీ కమిషన్

చార్మినార్, ఫిబ్రవరి 19: తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ కులగణన అవగాహన కార్యక్రమాన్ని ప్రతి ప్రాంతంలో నిర్వహిస్తున్నామని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తెలిపారు. కులగణనపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి బీసీ కమిషన్ ఆధ్వర్యంలో గత నాలుగో రోజులుగా నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు.బుధవారం బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ పాతబస్తీలోని దూద్ బౌలి, ఉమ్దాబజార్, ఉస్మాన్‌బాగ్‌లలో పర్యటించారు., కాలనీలో దాదాపు 200 ల కుటుంబాలను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ 040–21111111 కు ఫోన్ చేసి తమ వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.